

# కానుక

పోకిరీ అనుకున్న
కుర్రాడిని
మంచివాడుగా ఆమె
ఎలా గుర్తించింది?

# కానుక




సాయంత్రం అయిదు గంటలయింది. అచ్చటవున్న ఖాళీ మైదానమంతా పిల్లల అరుపులతో కేకలతో నిండిపోయింది. సాయం సంధ్య వేళ పక్షులంతా ఒకచోట చేరినట్టు పిల్లలంతా చేరి గోలగా అరుస్తున్నారు. అంతా పది పన్నెండులోపు పిల్లలే. వాళ్ళంతా క్రికెట్ ఆట ఆడటానికి సిద్ధమయ్యారు. అందులో తారల్లో చంద్రునిలా వెలిగిపోతున్నాడు వేణు. అతనే ఆ పిల్లలందరికి లీడర్. వేణు అందరికి ఏదో కోపంగా సర్దిచెబుతున్నాడు. అతని ముఖం కోపంగా వున్న అతని పెదాలు ఎప్పుడూ నవ్వుతూ వుంటాయి. అదే అతని ముఖానికి వింత అందం. ఆ మైదానం ప్రక్కనే వుంది చిన్న అందమైన డాబాయిల్లు. అందులో నుండి తొంగి చూసింది వసుంధర. వేణును చూడగానే ఆమె ముఖం చిట్లించింది. "ఈ పోకిరి వెధవలకు ఆటకు సమయం అయింది కాబోలు, ఐదు గంటలు కొడితేచాలు బెల్లం చుట్టూ ఈగల్లా రః వేణు చుట్టూ ముసురుకుంటారు. రః వెధవలకు లీడర్ ఈ వేణుగాడు. ఏదికి ఎప్పుడు చూసినా ఆటలే. ఆడితే ఒళ్ళు తెలియకుండా ఆడతాడు. ఆ పాడుబంతి వచ్చి చెట్లపై పడి చిన్ని క్రోటన్ చెట్లను నాశనం చేసిందో. ఇక్కడ ఆడొద్దురా అంటే వినరు వెధవలు" అనుకుంటూ బుద్ధిగా కూర్చుని చదువుకొంటున్న తన కొడుకుని చూసి నవ్వుతూ పాలు తీసుకురావటానికి లోపలికెళ్ళింది. వసుంధర కొడుకైన సుధీర్, వేణు ఒకే క్లాస్‌మేట్స్ అయినా వేణుతో చేరనివ్వదు వసుంధర.



అతనిలా పోకిరిగా తయారవుతాడని భయం. కాని వసుంధర అనుకునేటంత పోకిరికాదు వేణు. చదువులో ఫస్ట్ రావటమే కాకుండా ఆటల్లో కూడా ఫస్ట్. కాకపోతే క్రికెట్ ఆటంటే పిచ్చి ప్రాణం వేణుకి. క్రికెట్ ఆట ఆడేటప్పుడు సిక్సర్ కొట్టాల నుకుంటాడో ఏమో అప్పుడప్పుడు ఆ బంతి కాస్తా వెళ్ళి వసుంధర

తోటలోని చిన్నచిన్న చెట్లను బలి తీసుకుంటూ వుంటుంది. సుధీర్‌కు వేణుతో కలిసి చదువుకోవాలన్నా, ఆడాలన్నా ఎంతో ఇష్టం.

అతను అందరితో బాగా కలిసిపోతాడు. ఇతర విద్యార్థుల్లా పొగరుబోతుగా వుండడు. క్లాస్‌లో ఫస్ట్‌వస్తే మాష్టార్లంతా పొగుడుతూ వుంటే నవ్వుతూ చూస్తుండే అతని ముఖాన్ని మరీమరీ చూడాలనిపిస్తుంది. తన తల్లి భయంతో వేణుతో దూరంగా వుంటాడు సుధీర్. తన బిడ్డకంటే మరొకరు గొప్పగా వుంటే చూసి ఓర్వలేని ఒకరకమైన వీక్‌నెస్ వుంది వసుంధర దగ్గర. అందుకే అతనంటే ఒకరకమైన జెలసి. అది తనబిడ్డ చదువుపై ఆధారపడి వుంటుంది కాని ఆమె జెలసిపై కాదని అర్థం చేసుకోలేదు. అందుకే వేణు అంటే కోపం వసుంధరకు. ఎన్నోసార్లు క్రికెట్ బంతి వచ్చిపడినా దాన్ని విసిరివేయటమో, లేక కాలవలో వేయటమో చేస్తుంటుంది. పిల్లలంతా డబ్బులు పోగుచేసి కొనుక్కొని మరలా ఆటకు సిద్ధమయ్యేవారు.

వంటింట్లో నుండి పాలుకాచి తీసుకొస్తున్న వసుంధరకు 'అబ్బా' అన్న కేక వినిపించటముతో కంగారుగా బయటకు వచ్చింది వసుంధర. మోకాలు పట్టుకొని వంగిపోయి వున్నాడు సుధీర్. 'ఏమయింది నాన్నా' దగ్గరకొస్తూ అడిగింది. చిన్నగా మూలుగుతూనే ఒక చేత్తో ప్రక్కకు చూపించాడు సుధీర్. అటువైపు చూసిన వసుంధర కళ్ళు కోపంతో ఎరుపెక్కాయి. ఆకుపచ్చ రంగులో పచ్చని పట్టుపువ్వులా వున్న క్రికెట్ బంతి వసుంధరను చూసి నవ్వుతున్నట్టుంది. వెంటనే దాన్ని తీసి ప్రక్కకు పెట్టి ఇంట్లోకి వెళ్ళి జండుబామ్ తెచ్చి సుధీర్ కాలికి రాసి, పాలు చేతికిచ్చింది. అంతలో గేటు తీసుకొని మెల్లగా వచ్చాడు వేణు అతన్ని చూస్తూనే బంతిని చేతిలోకి తీసుకుంది.

"ఆంటీ, నా బాల్ పడింది ఇవ్వరూ" ఆమె చేతిలోని బంతిని చూస్తూ అడిగాడు. అంతే కస్సున లేచింది. "ఏరా ఆటలాడేటప్పుడు ఒళ్ళు తెలియటంలేదా? రోజు ఈ పాడు బంతితో చెట్లను నాశనం చేసేవాడివి. ఈ రోజు వాడి మోకాలు విరగొట్టావు. మీకు ఎన్నిసార్లు చెప్పినా బుద్ధి రాదురా కోతుల్లా గెంతటం తప్ప ఇంకేమి తెలియదు" కోపంతో విరుచుకుపడింది.

వేణు ప్రక్కకు తిరిగి సుధీర్‌వైపు చూశాడు. మోకాలు దగ్గర కొద్దిగా ఎర్రగా కందింది. వెంటనే అతని దగ్గరకు వెళ్ళి "సారీ సుధీర్ నీకు తగులుతుందనుకోలేదురా" భయంగా చెప్పాడు. "నోర్మూయి నంగివేషాలు వేసి బంతి తీసుకు వెళతామనుకుంటున్నావా? నీ వేషాలన్నీ నా దగ్గర కాదు" వసుంధర అంటూనే ప్రక్కనే కాలుతున్న చెత్తకుప్పవైపు దృష్టి సారించింది.

ఏమి జరుగుతుందో గ్రహించిన వేణు వెంటనే పరిగెత్తుకెళ్ళి "ఆంటీ ప్లీజ్ ఆంటీ ఆ బంతి కాల్చకండి ఆంటీ. అది నాకు ఆటల్లో ప్రైజ్ వచ్చింది. మా మమ్మీ డాడికి కూడా చూపించలేదు దాన్ని కాల్చకండి" బతిమాలుతూ అన్నాడు.

"నీకు ప్రైజ్‌వస్తే నాకేం? నువ్వు ఎవ్వరికి చూపించకుంటే నాకెందుకు


నీకు బుద్ధి రావాలంటే ఇలాగే వేయాలి మరి'' కోపంగా చెత్తకుప్పవైపు నడిచింది.

''సుధీర్ నువ్వయినా చెప్పు సుధీర్ ఆ బంతిని కాల్చవద్దని చెప్పరా'' వేణు కళ్ళల్లో ఎప్పుడు వురుకుదామా అన్నట్టు ఎదురు చూస్తున్నాయి కన్నీళ్ళు. నేను ఏమి చేయలేను అన్నట్టు మవునంగా వుండిపోయాడు అతను. మరలా వసుంధర వైపు తిరిగి ''ఆంటీ దాన్ని కాల్చకండి ఆంటీ, ఇక నుండి ఇక్కడ ఆడుకోము ఆంటీ, నా బంతి ఇచ్చేయండి ఆంటీ'' తెల్లని బుగ్గలపై జారిపోతున్నాయి కన్నీళ్ళు. వసుంధర హృదయం కరుగలేదు. విసురుగా బంతిని కాలుతున్న చెత్తకుప్పలోకి గిరాటేసింది. బంతి కాలి ఆ ప్రదేశమంతా ఒక విధమైన వాసన పేరుకుంది. అత్యంత ప్రియమైన వస్తువుని పోగొట్టుకున్నామనే బాధ కన్నీళ్ళుగా మారి వేణు కళ్ళలో నుండి జాలువారాయి.

** ** **

చెట్లకు నీళ్ళు పోస్తూ మైదానం వైపు తొంగి చూసింది వసుంధర. మైదానమంతా ఖాళీగా వుంది. ఏమిటె అయిదయినా ఈ కోతి మూక ఆటలకు రాలేదేంటి? నిన్నటితో బాగా బుద్ధి వచ్చివుంటుంది వెధవలకు'' నవ్వుకుంటూ నీళ్ళుపోయటంలో మునిగిపోయింది. స్కూల్ నుండి వచ్చిన సుధీర్ బ్యాగ్ లోపల పెట్టి షూస్ తీసి అలసటగా మంచంమీద పడుకున్నాడు. ''ఏమిటె బాబు పడుకున్నావు. ఒంట్లో బాగాలేదా'' దగ్గరకొచ్చి నుదుటిపై చేయివేస్తూ అడిగింది. ''బాగానే వుంది'' ముభావంగా అన్నాడు. ''మరి అలా వున్నావేం లేచి త్వరగా రెడి అవు మీ డాడి పిక్చర్‌కు తీసుకెళతానన్నారు'' అంది. ''నేను రాను మమ్మీ'' అటువైపు తిరిగి పడుకున్నాడు. ఎప్పుడూ సినిమా అంటే ఎగిరి గంతేసేవాడు ఈ రోజు అలా చెప్పేసరికి ఆశ్చర్యంగా చూసింది వసుంధర. ''ఏమిటినాన్నా ఏమయింది'' అతన్ని తనవైపు తిప్పుతూ అడిగింది.

## సబల!



*ఆ! ఆడపిల్లా! అని తీసి పారెయ్యకండి!* ఆడవాళ్లకి అబల అన్నది పాత మాట అని నిరూపిస్తుంది 24 సం.ల నీనా మహేంద్ర మెహతా. సముద్రమట్టం నుండి 18,383 అడుగుల ఎత్తు ఉన్న ''ఒర్ దుంగ్లా''ను సైకిల్ తొక్కుతూ చేరింది. ఇలా ఖర్‌దుంగ్లాకు చేరుకున్న తొలి మహిళ ఈమె.

మృత్యువు నీడలో వెంటాడే పర్వత రహదారులపై... సైకిల్ తొక్కుతూ చేరుకుందంటే... ఇది సామాన్య విషయం కాదుకదా మరి! అందుకే రికార్డ్ బద్దలుకొట్టిందీమె.

—రజనీశకుంతల (సికింద్రాబాద్)

సుధీర్ వైపు చూసిన వసుంధర ఉలిక్కిపడింది. సుధీర్ కళ్ళనిండా నీళ్ళు. "చెప్పమ్మా ఎందుకలా వున్నావు" లాలనగా అడిగింది. "మమ్మీ వేణుని హాస్పిటల్‌లో చేర్పించారు" ఏడుస్తూ చెప్పాడు. 'ఎందుకు' ఆత్రుతగా అడిగింది. అతనికి నుదుటిపై దెబ్బ తగిలి రక్తం బాగా పోయింది. ఏడుపు ఆగలేదు సుధీర్‌కు. "ఆ ఏదో పోకిరి పని చేసుంటాడు అందుకే అలా అయ్యుంటుంది" విసురుగా అంది.

"కాదు మమ్మీ రాయితో కొట్టడంవలన అలా జరిగింది"

"రాయితో కొట్టారా? ఎవరు?" ఆత్రుతగా అడిగింది.

"నేనే" ఏడుస్తూ చెప్పాడు. చెట్టుపైన పావురాన్ని గురిచేసి రాయితో కొట్టబోయాను. అది గురి తప్పి అతని నుదుటికి తగిలింది.

"నువ్వు కొట్టడం అతను చూశాడా" గబగబా అడిగింది.

"చూశాడు" ఏడుస్తూ చెప్పాడు.

"అయ్యో ఇప్పుడు ఎలా? వాడు వెళ్ళి వాడి తల్లికి చెబితే? అది అసలే గయ్యాళిది. దాని నోటికి పోలేము". ఏడుపు ఆగిపోయింది సుధీర్‌కు. కన్నార్పకుండా తల్లివంకే చూడసాగాడు. "నిన్న తన మమ్మీ చేసిందేమిటి? తనకు చిన్న దెబ్బ తగిలిందనే వేణు ఎంత బతిమాలినా బంతి ఇవ్వకుండా కాల్చేసి అతని మనసును ఎంత కష్టపెట్టింది? తన తల్లినేమనాలి? ఈ రోజు వేణుకు అంత పెద్ద దెబ్బ తగిలిందీ? వేణు మమ్మీకి కోపం రాకుండా ఎలా వుంటుంది? కాని ఆ పరిస్థితి రాకుండా చేశాడు వేణు" వేణుపై సుధీర్‌కు స్నేహం అనే బంధం మరింత గట్టిగా పెనవేసుకుంది. ఆలోచనలో పడిపోయింది వసుంధర. సుధీర్ ఆమె వంక చూస్తూ "మమ్మీ నీకు ఆ భయం అక్కర్లేదు. వేణు ఏమన్నాడో తెలుసా? సుధీర్ నువ్వు త్వరగా వెళ్ళిపో మా మమ్మీ చూసిందంటే తిడుతుంది" అని నన్ను పంపించేశాడు. సుధీర్ బుగ్గలపై కన్నీళ్ళు చారికలు కట్టాయి. ఇంట్లోకి వెళ్ళబోతున్న వసుంధర తక్కున వెనక్కి వచ్చింది. "ఏమిటి వేణు నిన్ను పంపించేశాడా? తనలో తను అనుకున్నట్లుగా అంది. వేణు వాడి వసుంధర చెంపమీద కొట్టినట్లయింది. నిన్న తను కన్న ప్రేమకు విలువనిస్తే అదేమీ మనసులో వుంచుకోకుండా అతను ఈ రోజు స్నేహానికి విలువనిచ్చాడు. ఇద్దరిలో ఎవరి ప్రేమగొప్పదో తేల్చుకోలేక పోయింది. స్నేహితుని మనసు బాధపెట్టకూడదని అతను పంపించేస్తే, స్నేహితునికి దెబ్బ తగిలిందని బాధపడే స్నేహితుడు మరొకడు. పువ్వు లాంటి ఈ చిన్నారి జీవితాలను పెద్దవాళ్ళమయిన మనమే ముళ్ళులా మారి నాశనం చేస్తున్నామా అనిపించింది. బతిమాలుతున్న వేణు ముఖమే మరీమరీ కనిపించసాగింది వసుంధరకు. "ఛీ ఎంత కఠినంగా ప్రవర్తించాను".

బి.ఎ. చదివిన తనకు, నైన్త్‌క్లాస్ చదువుతున్న తను ఉన్నతమైన మనసుతో నాకు పాఠం నేర్పించినట్టుగా వుంది. ఇన్నాళ్ళు పోకిరి అనుకున్న వేణు తన మనసులో ఒక ఉన్నత విద్యార్థిగా నిలిచాడు.

వేణు మీద వున్న జెలసీ క్రాస్త క్రమక్రమంగా మాయమయి ఆ స్థానంలో అభిమానం పేరుకోసాగింది.

** ** **

ఆ రోజు సాయంత్రం అయిదు గంటలయ్యింది. మైదానంలోకి తొంగి చూసింది వసుంధర. మైదానం బోసిగా తనను వెక్కిరిస్తున్నట్టుగా వుంది. ఒక్కసారి బాధగా నిట్టూర్చింది వసుంధర.

''బాబు సుధీర్ నీ ఫ్రెండ్ అయిన వేణుని ఒక్కసారి చూసి రాకూడదు'' హోంవర్క్ చేసుకుంటున్న సుధీర్ ఠక్కున తలఎత్తి చూశాడు అతని కళ్ళలో ఆనందం. ఆశ్చర్యం.

''నిజంగానా మమ్మీ'' దగ్గరకొస్తూ అడిగాడు.

''అవునుబాబు'' నవ్వుతూ చెప్పింది.

''నిన్ననే వెళ్దామనుకున్నాను మమ్మీ నువ్వు తిడతావని వూరుకున్నాను''

''ఇక నుండి నువ్వు వేణుతో కలిసి చదువుకోవచ్చు. ఆడుకోవచ్చు'' సుధీర్ తల నిమురుతూ చెప్పింది. ''థ్యాంక్స్ మమ్మీ'' తల్లిని గట్టిగా వాటేసుకున్న సుధీర్ గేటు తీసిన చప్పుడికి అటు తిరిగి చూశాడు

గేటు తీసుకొని వస్తున్నాడు వేణు. సుధీర్ కళ్ళు మెరిసాయి. వేణుని చూసిన వసుంధర హృదయం కలుక్కుమంది. తెల్లగా అందంగా మెరుస్తున్న ఆ నుదుటికి బాండేజ్ కట్టివుంది.

''ఆంటీ ఈ రోజు నా బర్త్‌డే. ఉదయం కొంచెం నొప్పిగా వుంటే రాలేకపోయాను''. చాక్లెట్ అందించాడు. ''ఇప్పుడెలా వుంది బాబు'' అడగలేక అడిగింది.

''తగ్గిపోయింది ఆంటీ'' నవ్వుతూ చెప్పాడు. ఒకప్పుడు అతని ముఖం చూస్తేనే మండిపడే వసుంధరకు ఇప్పుడు నవ్వుతున్న అతని ముఖాన్ని మరీమరీ చూడాలనిపించింది. అతనితో మాట్లాడాలన్నా సిగ్గుగా అనిపించి మౌనంగా వుండిపోయింది.



## జోక్

''ఏమండోయ్ మన మామిడి చెట్టుమీదికి దొంగ ఎక్కాడు''.

''అలాగా... ఐతే వాడ్ని వెంటనే తరమకు. కాయలు కోయిద్దామంటే మనిషి దొరకట్లేదు. వాడు కాయలన్నీ కోసేసాక కేక వేద్దాంలే'' సంబరంగా అన్నాడు భర్త.

–పద్మశ్రీ (మాణిక్యం)

స్నేహితులిద్దరూ మాట్లాడుకోసాగారు. వాళ్ళకు స్వీట్స్ ఇచ్చి అలాగే నిలబడిపోయింది. వేణు కొంతసేపు వుండి 'వస్తాను ఆంటీ' అంటూ వెళ్ళిపోబోతుంటే 'బాబు వేణు ఒక్క నిముషం' అంటూ ఇంట్లోకి వెళ్ళి ఒక పాకెట్ తెచ్చింది.


''ఇది బర్త్‌డే కానుక'' అంటూ చేతిలో వుంచింది.

''వద్దు ఆంటీ'' ఇచ్చేయపోయాడు.

''పర్వాలేదు తీసుకో దాన్ని చూసా వంటే నువ్వు వద్దనవు'' నవ్వుతూ చెప్పింది.

పాకెట్ మెల్లగా విప్పి చూశాడు వేణు. అతనికళ్ళు ఆనందంతో మెరిసాయి. ఎర్రటి కాగితంలో ఆకుపచ్చరంగులో మెరుస్తుంది క్రికెట్ బంతి.

ఆనాడు కాలుతున్న బంతివైపు చూస్తూ నిరాశతో కృంగిపోయిన ఆ కళ్ళు ఈ రోజు ఉత్తేజంతో మెరుస్తూవుంటే ఆనందంగా చూస్తూ వుండిపోయింది వసుంధర.*




డిజైన్: ఆర్. తారా బాలకృష్ణ (హైదరాబాద్)